## క్లుప్తంగా

### ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు పరామర్శ



తాతారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

**అమలాపురం రూరల్:** ఇటీవల మృతి చెందిన అమలాపురం ప్రైవేట్ ఎలక్ట్రికల్ బీగ్రేడ్ లైసెన్స్ యూనియన్ మాజీ గౌరవ అధ్యక్షుడు చిక్కం తాతారావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు శనివారం పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. తాతారావు కుటుంబసభ్యులను పరామర్శించినవారిలో మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, కౌన్సిలర్లు ఏడిద శ్రీను, బొర్రా వెంకటేశ్వరరావు, నల్లా స్వామి తదితరులున్నారు.

### అన్నదాన ట్రస్టుకు విరాళం



దాత శ్రీనివాసరావు దంపతులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈవో లక్ష్మీనారాయణ

**ఐ.పోలవరం:** ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలోని అన్నదాన ట్రస్టుకు పోలిశెట్టి శ్రీనివాసరావు, అనంతలక్ష్మి దంపతులు శనివారం రూ.10,011 నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ దాతను ఆలయ మర్యాదలతో స్వామి వారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేసి సత్కరించారు.

### చలి వేంద్రాన్ని ప్రారంభించిన సీఐ



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న పట్టణ సీఐ దుర్గాశేఖరరెడ్డి

**అమలాపురం టౌన్:** స్థానిక గడియారం స్తంభం సెంటరులో అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పట్టణ సీఐ ద్వారంపూడి దుర్గా శేఖరరెడ్డి శనివారం ప్రారంభించారు. తొలిరోజు చలి వేంద్రంలో మజ్జిగతో పాటు కూల్ డ్రింక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ వాకర్స్ ఏరియా కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, వాకర్స్ ప్రతినిధి పీవీ కన్నా, క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, జిల్లా డిప్యూటీ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


### చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ అందజేస్తున్న డీఎం సత్యనారాయణమూర్తి

**అమలాపురరం రూరల్:** ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల దాహం తీర్చేందుకు ఆర్టీసీ డిపో ఎదురుగా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించి ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రతిమాకుమారి, డిపో అధ్యక్షుడు దుర్గారావు, సెక్రటరీ దొరబాబు, ప్రతినిధులు రామారావు, ఎంఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సుబ్రహ్మణ్యేశ్వరునికి అష్ట ద్రవ్యాభిషేకాలు



బండారులంకలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

**అమలాపురం రూరల్:** మండలంలోని బండారులంకలో ఉన్న భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరుని పుట్టినరోజు సందర్భంగా స్వామి వారికి అష్ట ద్రవ్యాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

# అధిక ఉష్ణోగ్రతతో ఆక్వాకు ఉక్కపోత

- వేసవి తాపానికి చెరువుల్లో ఆక్సిజన్ లోపం
- ఆందోళన చెందుతున్న ఆక్వా రైతులు



సన్నవిల్లిలో ఆక్సిజన్ లోపించడంతో పట్టుబడి చేసిన రొయ్యలు

**కాట్రేనికోన:** భానుడు ఉగ్రరూపంతో రోజురోజుకి పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు చెరువుల్లోని రొయ్యలు, చేపలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలకు చెరువు నీటిలోని ప్లాంటేషన్ చనిపోవడంతో నీరు పలచబడి నేరుగా సూర్యరశ్మి చెరువు అడుగు భాగానికి చేరుతుంది. దీనివల్ల మట్టి పాచై తెట్టులుగా పైకి చేరుతుంది. దీంతో చెరువు నీటి నాణ్యత, మట్టి నాణ్యత దెబ్బతింటుంది. చెరువుల్లోని ప్లాంటేషన్ క్రాష్ కావడంతో జలచరాలు మేత సకాలంలో తినడం లేదు. మరోవైపు అధిక ఉష్ణోగ్రతల వల్ల అప్పుడప్పుడు కరెంట్ ట్రిప్ అవుతుండడం వల్ల ఆక్సిజన్ లోపం వచ్చి చేపలు, రొయ్యలు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వ్యాధుల విజృంభణ**

జిల్లాలోని అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్ళరేవు, మామిడికుదురు, రాజోలు, మలికిపురం మండలాల్లో సుమారు 34 వేల ఎకరాలలో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. మిశ్రమ పద్ధతిలో చేపల సాగు, పాలికల్చర్( మిశ్రమ పద్ధతిలో రొయ్యలు, చేపల సాగు), వెనామీ రొయ్యలు మూడు పద్ధతుల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం భగ్గుమంటున్న భానుడి కారణంగా ఎండలకు చెరువు నీటి, మట్టి నాణ్యత లోపించడం, ఆక్సిజన్ స్థాయి తగ్గడం, డెడ్ ఆల్గే, విషవాయువులు విజృంభించడంతో వెనామీ రొయ్యల సాగులో వైట్ గట్, వైట్ ఫీకల్ వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువు నీటి నాణ్యతను పెంచేందుకు, విషవాయువుల స్థాయి తగ్గించేందుకు అధిక ఖర్చుతో జియోలైట్ వంటి మందులను వాడాల్సి వస్తుందంటున్నారు.

**ఆక్సిజన్ స్థాయి తగ్గడంతో మృత్యువాత**

ఎండలకు చెరువుల్లోని ఆక్సిజన్ స్థాయి తగ్గిపోయి చేపలు, రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. రొయ్యల సాగులో ఆక్సిజన్ స్థాయిని పెంచేందుకు చెరువుల్లో రైతులు ఏరియేటర్లతో ఆక్సిజన్‌ను అందిస్తారు. అయితే విద్యుత్ ట్రిప్ అవుతున్న సమయాల్లో ఆ అవకాశం లేకపోతుంది. రొయ్యల చెరువులలో వెనామీ రొయ్యలు రన్నింగ్ మోర్టాలిటీతో ఏరియేటర్ల దగ్గరకు చేరి అధిక మొత్తంలో చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.



చెరువులో ఆక్సిజన్ పెంచేందుకు ఉపయోగిస్తున్న ఏరియేటర్లు

**కలెక్టర్ సమావేశం నిర్వహించారు**

అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులపై ఆక్వా అసోసియేషన్ ప్రతినిధులు, విద్యుత్ శాఖ, మత్స్యశాఖ అధికారులతో జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లా అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆక్వా రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

– షేక్ లాల్ మహ్మద్, మత్స్యశాఖ జేడీ

**ఆక్సిజన్ స్థాయి పడిపోతుంది**



అధిక ఉష్ణోగ్రతలతో విద్యుత్ సమస్యలు తలెత్తి చెరువులోని ఆక్సిజన్ స్థాయి పడిపోతుంది. చెరువులోని రొయ్యలు రన్నింగ్ మోర్టాలిటీతో ఏరియేటర్ల దగ్గర పడి చనిపోతున్నాయి.

– పినిపే జయరాజు, ఆక్వా రైతు, చల్లపల్లి

### బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న శెట్టిబలిజ సంఘ ప్రతినిధులు

**యానాం:** తాళ్లరేవు–యానాం బైపాస్ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు యానాం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయం చేశారు. బొక్కా అనంతలక్ష్మి, కల్లి పద్మావతి, చింతపల్లి జ్యోతి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున యానాం శెట్టిబలిజ సంఘం ప్రతినిధులు సాయాన్ని అందజేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న చింతపల్లి మంగ కుటుంబానికి సైతం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో శెట్టిబలిజసంఘ పెద్దలు పిల్లి త్రిమూర్తులు, గుత్తుల జయరామారావు, చింతాకుల రామకృష్ణ, మట్టపర్తి గణేష్, కాకి నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### ఆర్ఆర్ఆర్ సెంటర్‌లను ఉపయోగించుకోవాలి



ఆర్ఆర్ఆర్ సెంటర్ ప్రారంభించిన ఆర్ఏఓ మునిస్వామి

**యానాం:** ఇళ్ల వద్ద నిరుపయోగంగా ఉండే పాతవస్తువులను వృథాగా పడేయకుండా మరికొందరికి ఇచ్చేందుకు ఏర్పాటుచేసిన ఆర్ఆర్ఆర్(రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) సెంటర్లను అందరూ ఉపయోగించుకోవాలని ఆర్ఏఓ మునిస్వామి కోరారు. శనివారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలోని కమ్యూనిటీ హాలులో ఏర్పాటుచేసిన ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల వద్ద వృథాగా ఉండే పాత దుస్తులు, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఎలక్ట్రిక్ సామగ్రి, చెప్పులు, స్టేషనరీ మొదలైన వాటిని సేకరించి ఆర్ఆర్ఆర్ కేంద్రాల ద్వారా అవసరమైనవారికి అందజేస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- సరిపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



సరిపల్లిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి తనయుడు శ్రీకాంత్ తదితరులు

**ఉప్పలగుప్తం:** ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని సరిపల్లి గ్రామంలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా కలుగుతున్న లబ్ధిని వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, రుణమాఫీ, వాహనమిత్ర వంటి పథకాలతో అందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. గతంలో ఎన్నడూ లేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రిబాబ్జి, కార్యదర్శి పినిపే జయరాజ్, ఎస్ఎస్‌కుమార్, పాలమూరి బాబులు, కోరుకొండ మంగాయమ్మ, కిరణ్, కఠంశెట్టి బుజ్జి, పట్టా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా వలంటీర్లు



చొల్లంగిలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

**తాళ్లరేవు:** వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా పనిచేస్తున్నారని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. శనివారం మండల పరిధిలోని చొల్లంగి, చొల్లంగిపేట గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న వలంటీర్లను ఎంపీపీ సునీత స్థానిక నాయకులతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే తొలిసారిగా వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. విశేష సేవలందిస్తున్న వలంటీర్లను దుశ్శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమాల్లో వైస్సార్‌సీపీ నాయకులు బూరెల వెంకట్రాజు, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, నాయకులు కాపవరపు శ్రీదేవి, కందెల్ల గంగబాబు, కడియాల శ్రీను, శివాజీ గణేషన్ తదితరులు పాల్గొన్నారు.

## సమాఖ్య సభ్యులు అవగాహన కలిగి ఉండాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శివశంకర ప్రసాద్ తదితరులు

**ముమ్మిడివరం:** మండల సమాఖ్య సభ్యులందరూ ప్రాజెక్టు అంశాలపై అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర ప్రసాద్ పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా, మండల సమాఖ్య సభ్యుల అవగాహన సదస్సుకు ఆయన ఆధ్యక్షత వహించి మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల గ్రేడింగ్, సోషల్ మొబిలైజేషన్, గ్రామ, మండల సమాఖ్య సంఘాల పనితీరుపై సమీక్షించారు. ఆర్థిక కార్యకలాపాలు, ప్రభుత్వ పథకాలపై చర్చించారు. జగనన్న తోడు, హౌసింగ్, పీఎంఎఫ్ తదితర పథకాలు అందరికీ చేరేలా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో సమాఖ్య సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మన్ కీ బాత్ రూ.100 నాణెం సేకరణ




కృష్ణ కామేశ్వర్ సేకరించిన రూ.100 నాణెం




నాణెం రెండో వైపు ఉన్న ఆల్ ఇండియా రేడియో సింబల్

**అమలాపురం టౌన్:** ఆల్ ఇండియా రేడియోలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమం దేశంలోని పలు భాషలు, మాండలికాలతో పాటు విదేశీ భాషల్లో ప్రసారమై 100 ఎపిసోడ్‌లు పూర్తి చేసుకున్న సందర్భంగా కోల్‌కత్తా టంకశాల రూ.100 నాణేన్ని ముద్రించింది. ఈ నాణేన్ని అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ ప్రత్యేక ఆర్డర్‌పై సేకరించారు. నాణేనికి ఒక వైపు రూ.100 ముఖ విలువ, రెండో వైపు ఆల్ ఇండియా రేడియో సింబల్ ముద్రించారు. 35 గ్రాముల బరువుతో ఉండే ఈ నాణెంలో 50 శాతం వెండి, 40 శాతం రాగి, చెరో అయిదు శాతం నికెల్, జింక్ కలిగి ఉన్నాయి.

## 23 నుంచి లక్ష పిడకలతో యాగం



దీక్షా యాగం కరపత్రాలను విడుదల చేస్తున్న మహీ కిరణ్‌శర్మ తదితరులు

**అమలాపురం టౌన్:** ఈ నెల 23వ తేదీ నుంచి అమలాపురం శ్రీరామానంద ఆశ్రమంలో ఆరు రోజుల పాటు లక్ష ఆవు పిడకలతో సురభి–గోరక్ష దీక్షా యాగం చేపట్టనున్నట్లు హైదరాబాద్ శ్రీ మహీ వారాహ ట్రస్ట్ చైర్మన్, యాగ నిర్వాహకులు కుందుర్తి మహీ కిరణ్‌శర్మ తెలిపారు. అమలాపురం ఎర్ర వంతెన వద్ద గల గీతాశ్రమం ప్రాంగణంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ప్రసిద్ధ దేవాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాల్లో కోటి ఆవు పిడకలతో సురభి–గోరక్ష దీక్షా యాగాలు చేయడమే లక్ష్యమన్నారు. ఆవులను సంరక్షిస్తూ గో ఉనికిని చాటుతూ లక్ష పిడకలు తమ ట్రస్ట్‌కు అప్పగించే గో ప్రేమికులు, రైతులకు రూ.20 వేలు అందజేస్తామని స్పష్టం చేశారు. గీతాశ్రమం ట్రస్ట్ చైర్మన్ ఆకుల బాబి, కార్యదర్శి కోలా రాంబాబు, కార్యదర్శి ఆకుల శ్రీదేవి, ట్రస్ట్ సభ్యులతో కలిసి అమలాపురంలో 23వ తేదీ నుంచి చేపట్టనున్న దీక్షా యాగం కరపత్రాలను విడుదల చేశారు.

### గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

**ముమ్మిడివరం:** గంజాయి అక్రమ రవాణా కేసులో మరో ముద్దాయిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.సురేష్‌బాబు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 5న కొంతమంది యువకులు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి అక్రమంగా తరలిస్తుండగా ముమ్మిడివరం మండలం అన్నంపల్లి అక్విడెక్ట్ వద్ద పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే అదే కేసులో నిందితుడైన రౌతులపూడికి చెందిన ఎద్దు ప్రతింకుమార్ అలియాస్ పండుబ్రో అప్పట్లో పరారయ్యాడు. శుక్రవారం రాత్రి ముమ్మిడివరం మండలం నడిమిలంక వద్ద అతడిని అరెస్ట్ చేసి శనివారం కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

### పని చేయని సొసైటీలపై చర్యలు

**యానాం:** పుదుచ్చేరిలోని నాలుగు రీజియన్‌లలోను ఎటువంటి కార్యకలాపాలు సాగించని 1512 సొసైటీలను గుర్తించామని, వాటిపై చర్యలు తీసుకోనున్నట్లు డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ గోకుల్‌నాథ్ శనివారం తెలిపారు. వివిధ సొసైటీలు ముఖ్యంగా విద్య, ప్రజాసంక్షేమం, ఆర్ట్, లిటరేచర్, సోషల్ సర్వీస్ తదితర విభాగాల్లో సేవలందించేందుకు సొసైటీ రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం రిజిస్టర్ అయ్యారన్నారు. అయితే అవి కేవలం నామమాత్రంగానే ఉన్నాయని, పనిచేయడం లేదని డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ జరిపిన విచారణలో తేలిందన్నారు. వాటిపై చర్యలు తప్పవని చెప్పారు.

### 116 స్కూళ్లలో సీబీఎస్ఈ

**యానాం:** పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ నాలుగు రీజియన్‌ల్లోను 116 ప్రభుత్వ స్కూళ్లలో సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళిక అమలు చేయనున్నట్లు పుదుచ్చేరి విద్యామంత్రి నమశ్శివాయం శనివారం తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. దశల వారీగా సీబీఎస్ఈ సిలబస్‌ను అమలుచేస్తున్నామని, దీంట్లో భాగంగా ఈ ఏడాది 6 నుంచి 12వ తరగతి వరకూ సీబీఎస్ఈ సిలబస్ ఉంటుందన్నారు. పదో తరగతి, పన్నెండో తరగతిలో తక్కువ పాస్ పర్సంటేజ్ నమోదైన స్కూల్స్, కళాశాలలపై విచారణ జరపడానికి కమిటీని నియమించినట్లు ఆయన తెలిపారు.

## అనధికార లేఅవుట్‌లకు అక్రమ మట్టి రవాణా



అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్

**ఉప్పలగుప్తం:** మండలంలోని చల్లపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా యథేచ్ఛగా మట్టి రవాణా సాగుతుంది. స్థానిక గ్రామంలోని వైరుపేటకు వెళ్లే రోడ్డులో ఉన్న వైన్ షాపు ప్రాంతం నుంచి మట్టిని ట్రాక్టర్‌లతో తరలించి మెయిన్ రోడ్డును ఆనుకొని సిద్ధం చేస్తున్న రియల్‌ఎస్టేట్ లేఅవుట్‌కు తరలిస్తున్నారు. ఈ ట్రాక్టర్‌లను మైనర్ యువకులు నడుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ట్రాక్టర్‌లతో చేసే మట్టి రవాణాకు, లేఅవుట్‌ల్లో నింపుతున్న మట్టికి ఎటువంటి అనుమతులు లేకపోయినా స్థానిక రెవెన్యూ సిబ్బంది కనీసం కన్నెత్తి చూడటం లేదని గ్రామస్తులు శనివారం సాక్షికి తెలిపారు.

## గాయపడిన బాలిక మృతి



లక్ష్మీజాహ్నవి(ఫైల్)

**అమలాపురం టౌన్:** రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన స్థానిక మైపాలవీధికి చెందిన జంగా లక్ష్మీజాహ్నవి(11) కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందింది. గాంధీనగర్ రోడ్డుపై శుక్రవారం మధ్యాహ్నం తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న జాహ్నవిని స్థానికులు గుర్తించి స్థానికంగా ఆసుపత్రికి తరలించిన సంగతి తెలిసిందే. తొలుత స్థానిక ఆసుపత్రికి, తరువాత కిమ్స్‌కు తీసుకెళ్లి అత్యవసర వైద్యం అందించినా ఆమె పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం శుక్రవారం రాత్రి కాకినాడ తరలించారు. అక్కడి నుంచి విశాఖపట్టణంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో చిన్నారి తుదిశ్వాస విడిచింది. లక్ష్మీజాహ్నవి అమలాపురంలోని సర్ సీవీ రామన్ స్కూలులో ఆరో తరగతి చదువుతోంది. ఆమెకు తండ్రి, తల్లి, సోదరుడు ఉన్నారు. కాకినాడలో బాలికకు పోస్టుమార్టం పూర్తయ్యాక శనివారం సాయంత్రం ఆమె మృతదేహాన్ని అమలాపురంలోని స్వగృహానికి తరలించారు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న జాహ్నవి మరణంతో ఆమె కుటుంబీకులు కన్నీరు మున్నీరవుతున్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడం వల్లే జాహ్నవి గాయాలపాలై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

### ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

**యానాం:** పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని యానాం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను వివిధ డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ ఎకనామిక్స్, బీకామ్ జనరల్, బీఎస్సీ మాథమెటిక్స్, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్‌సైన్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ బోటనీ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. వచ్చే నెల 30లోగా దరఖాస్తులను సమర్పించాలని చెప్పారు. జులై మొదటి, రెండో వారాల్లో కౌన్సిలింగ్ ఉంటుందని, జులై 17 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

### పాలిసెట్‌లో మధుప్రియకు 168వ ర్యాంక్



మధుప్రియ

**అమలాపురం టౌన్:** పాలిసెట్ ఎంట్రన్స్ ఫలితాల్లో అమలాపురం పట్టణం కురసాలవారివీధికి చెందిన మహదశ వీర వెంకట సాయి మధు ప్రియ 168వ ర్యాంక్ సాధించింది. ఆమె తల్లి గృహిణి కాగా తండ్రి నాగేశ్వరరావు అమలాపురంలో ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపు నిర్వహిస్తున్నారు. మధుప్రియకు ఆమె కుటుంబీకులు స్వీటు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ముంబై ఐఐటీలో సీటు సాధించాలన్న లక్ష్యంతో చదువుతున్నానని మధు ప్రియ చెబుతోంది. ఆమె ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను 594 మార్కులు సాధించి ప్రతిభ చాటింది.

### కాంపిటేటివ్ పరీక్షల కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**యానాం:** ఎస్సీ, ట్రైబల్ విద్యార్థులకు వివిధ కాంపిటేటివ్ పరీక్షల నిమిత్తం పుదుచ్చేరిలో ఉచిత కోచింగ్ ఇవ్వడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని నేషనల్ లైవ్‌లీహుడ్ సర్వీస్ సెంటర్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ కొటూర్‌స్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షల కోసం ప్రత్యేక గైడెన్స్, కోచింగ్‌తో పాటు కంప్యూటర్ శిక్షణ, షార్ట్‌హ్యాండ్ ట్రైనింగ్ ఇస్తున్నామన్నారు. అభ్యర్థులకు ప్రతినెలా రూ.1000 అలవెన్స్, ఉచితంగా పోటీ పరీక్షల మెటీరియల్ అందజేస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 31లోగా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్, నేషనల్ లైవ్‌లీహుడ్ సెంటర్ ఫర్ ఆదిద్రావిడ, పుదుచ్చేరికి పంపాలన్నారు.